క్లుప్తంగా

పరామర్శ

చెన్నారావుపేట: మండల కేంద్రానికి చెందిన బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు గోల్కొండ శ్రీనివాస్ (48) బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. మృతునికి భార్య పద్మ, కుమారుడు ప్రేమ్‌చంద్, కుమార్తె స్పందనలు ఉన్నారు. మృతదేహంపై పూలమాలతో పాటు, బీజేపీ జెండాను మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కప్పారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు మల్లయ్య ఉన్నారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట: మండలంలోని అక్కల్‌చెడకు చెందిన రావుల వీరస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి ఆర్థిక పరిస్థితిని గ్రామస్తులు వాట్సాప్ గ్రూప్‌ల్లో దాతల సాయం కోరారు. సర్పంచ్ తూటి పావని, రమేష్, సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణ చైతన్యరెడ్డి, ఉపసర్పంచ్ వీరన్న, పులిశేరు రాజేందర్ అందించిన రూ. 20,100 ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

పేదల పెన్నిధి లింగారెడ్డి

గీసుకొండ: దివంగత లింగారెడ్డి సీపీఎం పార్టీలో ఉంటూ పేదలకు ఎనలేని సేవ చేశారని ఆ పార్టీ మండల నాయకులు తొగటి బ్రహ్మాచారి అన్నారు. బుధవారం గట్టు లింగారెడ్డి స్వగ్రామం కొమ్మాలలో ఆయన 41వ వర్ధంతి సందర్భంగా లింగారెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు జక్కుల వెంకన్న, జి.సాంబయ్య, టి. అయిలయ్య, మల్లయ్య, కొండా తిరుపతి, ఎం.చిరంజీవి, వి.సాంబయ్య, పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేసిన సర్పంచ్

రాయపర్తి: పారిశుద్ధ్య కార్మికులు సమ్మెబాట చేపట్టడంతో గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తీసేయడంలో కష్టాలను ఎదురు చూసిన సర్పంచ్ నలమాస సారయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా మారాడు. వార్డుమెంబర్‌లతో కలిసి ట్రాక్టర్‌లో చెత్తను జమచేయించి తోలుకొని వెళ్లి డంపింగ్ యార్డులోకి తీసుకెళ్లాడు. వీధుల్లో తిరుగుతూ చెత్తను సేకరించాడు. ప్రభుత్వ ఆదేశానుసారం తాత్కాలిక సిబ్బందిని రోజువారి వేతనం ఇచ్చి తీసుకోవాలని ఆదేశాలున్నప్పటికీ గ్రామంలో చెత్తను ఎత్తేందుకు ఎవరూ రాకపోవడంతో వార్డు సభ్యులతో కలిసి సర్పంచ్ పారిశుద్ధ్య కార్మికుడిగా మారాడు.

సమస్యలు పరిష్కరించాలి

వర్ధన్నపేట : నియోజకవర్గంలోని హోంగార్డులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను పర్మినెంట్ ఉద్యోగులుగా, కారుణ్య నియామకాలు, రిటైర్‌మెంట్ సమయంలో ఆర్థికసాయం,హెల్త్‌కార్డుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతూ వినతిలో పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

నర్సంపేట : దుగ్గొండికి చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 15 కుటుంబాలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బుధవారం చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ఆకుల శ్రీనివాస్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ తోకల నర్సింహారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కామిశెట్టి ప్రశాంత్, మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి చేయూత



రాయపర్తి : నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థినికి కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి చేయూతనందించారు. మండలంలోని పెర్కవేడుకు చెందిన కొండ హాసిని ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఇటీవల పదవ తరగతిలో 9.5 జీపీఏ సాధించింది. పాలిటెక్నిక్ చదువుకునేందుకు తమవంతు సాయం చేయాలని గ్రామానికి వచ్చిన ఝన్సీరెడ్డిని కోరగా మూడేళ్లపాటు చదువుకునేందుకు అయ్యే ఖర్చు రూ.3లక్షలు తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు. కొన్ని రోజుల క్రితం హాసిని తల్లి మృతి చెందింది. చేయూతనందించడంతో విద్యార్థిని తండ్రి సంపత్, పలువురు హర్షం వ్యక్తం చేశారు.

హామీల అమలుపై సమాధానం చెప్పాలి

సంగెం: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని టీడీపీ పరకాల ఇన్‌చార్జ్ గన్నోజు శ్రీనివాసాచారి ప్రశ్నించారు. బుధవారం మండల కేంద్రంలో గడప గడపకు గన్నోజు కార్యక్రమంలో ఇంటికి ఇంటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గూడ సంపత్‌రెడ్డి, సాంబరెడ్డి, దెయ్యాల చంద్రమౌళి, బ్రహ్మం, బందెల శివ, లక్కం ప్రకాష్, గంగబోయిన రవీందర్, రేగూరి వెంకట్‌రెడ్డి, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాల్‌తండా జీపీ ఏర్పాటుపై ఆశలు

- అర్హత ఉన్నా గతంలో నోచుకోని వైనం
- ఎమ్మెల్యే కృషితో మళ్లీ ప్రతిపాదనలు
- వివరాలు సేకరిస్తున్న అధికారులు



గ్రామ మ్యాప్ వివరాలు సేకరిస్తున్న మండల అధికారులు

ఖానాపురం : తండాలను అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. తద్వారా ప్రతి జీపీ పరిధిలోని ప్రజలకు తెలంగాణ అభివృద్ధి ఫలాలు అందిస్తూ గ్రామాలను తీర్చిదిద్దడానికి శ్రీకారం చుట్టడంతో అనేక తండాలు జీపీలుగా ఏర్పడ్డాయి. కానీ ఖానాపురం మండలంలోని ఓ తండా అన్ని అర్హతలు ఉన్నా పంచాయతీ ఏర్పడకుండానే మిగిలిపోయింది. దీంతో తండాను జీపీగా ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని ధర్మరావుపేట జీపీ పరిధిలో బాల్‌తండా పరిధిలో 715 మంది జనాభా ఉన్నారు. 2018 సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టింది. 500 జనాభా ఉన్న ప్రతి తండాను జీపీగా ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపాలని నాడు ఆదేశాలు జారీ చేశారు. బాల్‌తండాకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ నాడు నివేదికలు పంపలేకపోయారు. దీంతో తండాకు చెందిన ప్రజలంతా అర్హత ఉన్నప్పటికీ జీపీగా ఎందుకు ఏర్పాటు చేయలేదని మండల పరిషత్ కార్యాలయ ముట్టడితో పాటు ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. అయినప్పటికీ సాధ్యం కాలేదు. ఇటీవల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో తండావాసులంతా నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిసి బాల్‌తండాను జీపీగా ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే పెద్ది మంత్రుల దృష్టికి తీసుకెళ్లగా ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో బాల్‌తండా విషయంపై చర్చకు వచ్చినట్లు తెలిసింది. తండాకు అన్ని అర్హతలు ఉండటంతో వెంటనే ప్రతిపాదనలు మరోసారి పంపాలని పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు వచ్చాయి. జిల్లా అధికారుల నుంచి మండల అధికారులకు ఆదేశాలు రావడంతో ఇప్పటికే గతంలో పంపిన నివేదికలతో పాటు గ్రామానికి సంబంధించిన మ్యాప్ సర్వేను బుధవారం ఎంపీఓ పసరగొండ రవి ఆధ్వర్యంలో చేపట్టారు. సత్వరమే నివేదికలను గురువారం వరకు పంచాయతీరాజ్ కమిషనర్‌కు అందించాలనే ఆదేశాలు రావడంతో అధికారులు నివేదికలు పంపడానికి ముమ్మరంచేశారు. దీంతో తండా ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఆదేశాలు వచ్చాయి : రవి, ఎంపీఓ

బాల్‌తండాను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడానికి కావల్సిన ప్రతిపాదనలు పంపాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో గ్రామానికి సంబంధించిన మ్యాప్‌తో పాటు గతంలో పంపిన ప్రతిపాదనలన్నింటినీ కలిపి ఉన్నతాధికారులకు పంపుతున్నాం.

నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకోవాలి



రాయపర్తి : వర్షానికి కొట్టుకుపోయిన పొలాలను పరిశీలిస్తున్న ఝాన్సీరెడ్డి



నర్సంపేట: డోర్ టు డోర్ ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయపర్తి: భారీ వర్షాలతో నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకోవాలని కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ నాయకురాలు, ఎన్ఆర్ఐ అనుమాండ్ల ఝాన్సీరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలో జీపీ కార్మికులు చేస్తున్న సమ్మెలో పాల్గొని వారికి సంఘీభావం తెలిపి హామీ ఇచ్చారు. అనంతరం మండలకేంద్రం నుంచి రాగన్నగూడెం, పెర్కవేడు మీదుగా గట్టికల్, ఊకల్ వరకు వాహనాల ద్వారా ప్రయాణిస్తూ భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వరి, పత్తిపంటలను ఆమె పరిశీలించారు. పెర్కవేడు శివారులో మహిళా కూలీలతో కలిసి వరినాటు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదల కారణంగా పంటపొలాల గుండా నీళ్లు ప్రవహించడంతో ఇసుకమేటలు పేరుకుపోయిందన్నారు. ఆమె వెంట బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్, ఊగ మునిత, సాజహాన్‌బేగం, నాయకులు కృష్ణమాచార్యులు, కృష్ణారెడ్డి, కుందూరు విక్రమ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వల్లపు కుమార్, నీలయ్య, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

నర్సంపేట : కాంగ్రెస్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి గొట్టిముక్కల సాగరిక రమాకాంత్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేముల ఇంద్రదేవ్ అధ్యక్షతన బుధవారం యూత్ కాంగ్రెస్ డోర్ టూ డోర్ ప్రచార కార్యక్రమాన్ని పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, కాంగ్రెస్ మునిసిపాలిటీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శివకుమార్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోని ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామంలో ప్రతి ఇంటికి, ప్రతి ఒక్కరికి తెలిసేలా చేయడమే ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి సందీప్, మండల యూత్ అధ్యక్షుడు కుక్కమూడి అశోక్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ములుకల మనీష్ చెన్నారావుపేట, నల్లబెల్లి, దుగ్గొండి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బండి హరీష్, పురుషోత్తం సురేష్, నరిగె ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

తపాలా బీమా..కుటుంబానికి ధీమా



చెక్కును అందజేస్తున్న నరసింహస్వామి

సంగెం: పోస్టాఫీస్ ద్వారా లభించే గ్రామీణ తపాలా బీమా కుటుంబాలకు ఎంతో ధీమాను ఇస్తుందని వరంగల్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ నరసింహస్వామి అన్నారు. గతంలో మండలంలోని కాట్రపల్లిలో పోస్టల్ బీమా తీసుకున్న వ్యక్తి పోశాల రమేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందాడు. మృతుని కుటుంబానికి పోస్టల్ శాఖ నుంచి రూ.10 లక్షల బీమా చెక్కును బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరు పొదుపులతో పాటుగా రూ.399లతో బీమా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పూలుగు సాగర్‌రెడ్డి, ఎంపీటీసీ గాయపు ప్రచుర్ణ, పోస్టల్‌శాఖ సర్కిల్ మేనేజర్ భాస్కర్ నాయక్, పోస్ట్‌మాస్టర్ గోగుల రాజేందర్‌రెడ్డి, టాటా ఇన్సూరెన్స్ మేనేజర్ వీరేంద్ర, తపాలాశాఖ అధికారులు సైదానాయక్, సుమన్, రమేష్, అరుణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న సారయ్య

ఖానాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఎఫ్ఎల్ఎన్ జిల్లా ఆఫీసర్, ఏఎంఓ సారయ్య అన్నారు. స్థానిక హైస్కూల్‌లో తొలిమెట్టుపై మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదవడం, రాయడంతో పాటు గణితంలో ప్రతిభ కనబర్చేలా క్షుణ్ణంగా వారికి వివరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్ ఉంటుందనే విధంగా వారిని తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులపై ఉపాధ్యాయులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎస్ఆర్‌జీ గ్రూప్ మెంబర్ శ్రీనివాస్, మండల నోడల్ ఆఫీసర్ మంగ్యానాయక్, కోర్స్ డైరెక్టర్లు మంజుల, శ్రీధర్, అనిత, కర్ణాకర్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాల గదిని ప్రారంభిస్తున్న సీఐ సూర్యప్రసాద్

ఖానాపురం: సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించుకోవచ్చని నర్సంపేట రూరల్ సీఐ సూర్యప్రసాద్ అన్నారు. మండలంలోని బుధరావుపేటలో దాతల ద్వారా సేకరించిన విరాళాలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమన్నారు. ప్రతీ ఒక్కరూ వ్యాపార సముదాయాల వద్ద, ఇండ్ల వద్ద ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడానికి దాతలు ముందుకు రావాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న సీఐ సూర్యప్రసాద్, ఎస్సై తిరుపతిని గ్రామ పంచాయతీ పాలకవర్గంతో పాటు పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాస ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, మౌలాన, మురళీ, పసునూరి వెంకటటేశ్వర్లు, నాగరాజు, లాల్‌సాహెబ్, రాంనర్సింహారెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

బోధన మెరుగుకు తొలిమెట్టు శిక్షణ

పర్వతగిరి : ఉపాధ్యాయుల బోధన పద్ధతులను మెరుగుపర్చుకోవడానికి తొలిమెట్టు శిక్షణ తరగతులు ఎంతగానో తోడ్పడుతాయని మండల నోడల్ ఆఫీసర్ గాయపు లింగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయులకు బుధవారం తొలిమెట్టు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ ఆరు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించబడుతాయని అన్నారు. శిక్షణ తరగతులు ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. తద్వారా విద్యార్థులకు సులభతరమైన పద్ధతిలో బోధించడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎండీ.జలీల్, డీఆర్‌పీలు రామ్మోహన్, అశోక్, రిసోర్స్ పర్సన్ టి.చైతన్య, డి.కిశోర్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది నాగినేని శిల్ప, గారే జయరాజ్, సారయ్య, పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్: తొలిమెట్టు విద్యార్థులకు మంచి ఫలితాలు సాధించడానికి ఎంతో ఉపయోగపడుతుందని, కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీపీ మోతె కళావతి అన్నారు. మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు తీరును ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌జీ చక్రవర్తులు, శ్రీనివాస్, క్వాలిటీ కోఆర్డినేటర్ మాలోత్ సారయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రైతు రుణమాఫీ హర్షణీయం

నర్సంపేట: నేటి నుంచి రైతు రుణమాఫీ చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడం హర్షణీయమని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఎన్ని ఇబ్బందులు వచ్చిన కేసీఆర్ మానవతా దృక్పథంతో ఆలోచించి రైతుల పక్షాన నిలబడేందుకు రైతులు రుణమాఫీ పూర్తి చేయాలని నిర్ణయించారని తెలిపారు. రుణమాఫీ పూర్తి చేసి నేడు రైతులకు రుణం నుంచి విముక్తి చేస్తున్నారన్నారు.

మొక్కలను విరివిగా నాటాలి

చెన్నారావుపేట: మొక్కలను విరివిగా నాటాలని ఎంపీడీఓ భారతి అన్నారు. మండలంలోని పాపయ్యపేటలోని నర్సరీని ఆమె పరిశీలించారు. మొక్కల పెంపకంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కలు పంపిణీ చేయాలన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సంగెం: ఎరుకల సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ స్థానం కల్పించినందుకు కృతజ్ఞతగా మండల ఎరుకల సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో తెలంగాణ ఎరుకల సంఘం మండల అధ్యక్షుడు పల్లకొండ భిక్షపతి, రాయపురం సాంబశివ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతిరి రాజశేఖర్, ప్రభాకర్, సమ్మయ్య, రమేష్, సదానందం పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాకే ఓట్లు అడగాలి

నల్లబెల్లి: బీఆర్‌ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల హామీలను నెరవేర్చాకే రాబోయే ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు ప్రజల వద్దకు రావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో శివారెడ్డి, శేఖర్, చరణ్ సింగ్, కుసుంబ రఘుపతి, కొంరెల్లి, ఉపేందర్‌రెడ్డి, రాజు కుమార్, పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

వర్ధన్నపేట: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా జాగ్రత్త పడాలని నల్లబెల్లి గ్రామంలోని ఆరోగ్య కేంద్రం ఆయుష్ డాక్టర్ మూర్తినేని రామారావు అన్నారు. బుధవారం మండలంలోని ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హెచ్ఎం శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ టి.నర్సయ్య, పాల్గొన్నారు.

చెన్నారావుపేట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ సరోజ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గురిజాల గ్రామంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు సహజ, సూపర్‌వైజర్లు రామేల్, సువార్త, శివాజీ, వెంకట్‌రెడ్డి, రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రలు వేయాలి

చెన్నారావుపేట: నులి పురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయాలని డాక్టర్ సరోజ అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 20న వేయాల్సిన మాత్రలు వర్షాల కారణంగా వాయిదా గురువారం వేయడం జరుగుతుందన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి టీకాలు

సంగెం: మండలంలోని గేదెలు, ఆవులు, ఎడ్లకు ముద్ద చర్మవ్యాధి, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు గురువారం నుంచి ఈనెల 29 వరకు ఇవ్వనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ వల్లె రాజు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తునికాకు బోనస్ ఇప్పించాలి

ఖానాపురం : మండలంలోని పలు గ్రామాలకు చెందిన తునికాకు కూలీలకు బోనస్ ఇప్పించాలని పగడాల రాంనర్సింహారెడ్డి, కరీంపాషాలు కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 2012 నుంచి 2014, 2016 నుంచి 2017, 2021,22 సంవత్సరాల్లో తునికాకు కల్లెదారులకు బోనస్ రాలేదన్నారు. ఇతర జిల్లాలకు చెందిన వారికి బోనస్‌లు వచ్చాయని, వరంగల్ జిల్లాకు చెందిన వారికి మాత్రం ఇప్పటి వరకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు సహకరించి కల్లెదారులకు ఇప్పించాలని కోరారు.

రోగులకు పండ్ల పంపిణీ

రాయపర్తి: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ వర్ధన్నపేట ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రావుల అనిల్‌కుమార్ మాట్లాడుతూ లయన్ 320ఎఫ్ జిల్లా గవర్నర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు పుట్టిన రోజు సందర్భంగా కంటి ఆపరేషన్లకు కరీంనగర్‌కు వెళ్తున్న రోగులకు పండ్లు, బ్రెడ్‌లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కొమురవెల్లి లింగమూర్తి, మందాటి సుదర్శన్‌రెడ్డి, సునీల్‌కుమార్, తేరాల మధు, సుభాష్‌రెడ్డి, రంగారావు, అల్లాడి సతీష్, కానూరి వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం



నల్లబెల్లి : తల్లిపాలే బిడ్డకు అమృతమని, బిడ్డను భవిష్యత్తులో జబ్బుల బారిన పడకుండా కాపాడుతుందని నర్సంపేట ఏసీడీపీఓ హేమలత అన్నారు. మండలంలోని నారక్కపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. సూపర్‌వైజర్ శ్యామలాదేవితో కలిసి ఆమె చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. తల్లులు, పిల్లలకు వైద్యపరీక్షలు చేశారు.

వరంగల్ ఎంపీని కలిసిన మాజీ జెడ్పీటీసీ

వర్ధన్నపేట: వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్‌ను ఆయన జన్మదినం సందర్భంగా బుధవారం మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలకుర్తి శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నర్సరీని సందర్శించిన బీసీఐ ఇండియా ప్రతినిధులు

పర్వతగిరి : 'మారి' సంస్థలో ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ వారు ఏర్పాటు చేసిన నర్సరీని బుధవారం బీసీఐ ఇండియా ప్రతినిధులు రిలేషన్ షిప్ మేనేజర్ అఖిల్ దేవ్, సహజ వనరుల కో-ఆర్డినేటర్ దివ్య, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా అసోసియేట్ డైరెక్టర్ వంశీకృష్ణ, ప్రోగ్రాం ఆఫీసర్ హర్షలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు నర్సరీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలను గ్రేటర్ వరంగల్ మునిసిపాలిటీ నుంచి సీటి కంపోస్టు తీసుకుచ్చి జల్లెడ పట్టి బ్యాగ్స్ రైతులకు అందించామని తెలిపారు. కార్యక్రమం ద్వారా రైతులకు తక్కువ ధరలకే మొక్కలు, సీటి కంపోస్టు అందిస్తున్న ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ చైర్మన్ ప్రకాశ్‌రావు, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రాజెక్టు మేనేజర్ ఇన్నారెడ్డి, పియు మేనేజర్ శ్రీధర్, వర్షిని, ప్రాజెక్టు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీని విలీనం చేయడం హర్షణీయం

- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం నర్సంపేట డివిజన్ ఆర్టీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. నర్సంపేట డిపో మేనేజర్ విజయమాధురి, ప్రైవేట్ బస్సుల అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి ప్రసాద్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు పాల్గొన్నారు.


రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలి

అంగన్‌వాడీలకు వేతన పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించడం కోసం ఎమ్మెల్యే అసెంబ్లీలో చర్చించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే పెద్దికి వినతిపత్రం అందజేశారు.బీఆర్‌టీయూ జిల్లా నాయకుడు పాలడుగు రమేష్, ప్రాజెక్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొర్రె రాధ, బత్తిని శిరీష, మండల ప్రధాన కార్యదర్శి డి.రమాదేవితోపాటు ధనలక్ష్మి, సబిత, గౌసియా, హైమావతి, పద్మ, సరోజన, సునీత, కొమురమ్మ పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు నర్సంపేటలో చోటు లేదు

చెన్నారావుపేట : వచ్చే ఎన్నికల్లో నర్సంపేటలో ప్రతి పక్షాలకు చోటు లేదని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. లింగగిరిలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బానోతు పత్తినాయక్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో ఎమ్మెల్యే దోపిడీ



కోనారెడ్డి చెరువును సందర్శిస్తున్న కాంగ్రెస్ నేతలు

వర్ధన్నపేట: అభివృద్ధి పనుల పేరుతో స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేశ్ దోపిడీ చేస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారని మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావు అన్నారు. వర్ధన్నపేట కోనారెడ్డి చెరువును కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనారెడ్డి చెరువు కట్ట తెగిపోయి మూడేళ్లు దాటుతున్నా, ఏడాది క్రితం రూ.13.25 కోట్ల నిధులతో నాణ్యత లేకుండా పనులు చేపట్టి దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. సంవత్సరం దాటినా పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే చెరువులను బాగు చేయడని ఉన్న చెరువులను పనికి రాకుండా చేస్తున్నాడని దుయ్యబట్టారు. అభివృద్ధి పనులు చేశానని చెప్పుకుంటున్నాడే తప్ప ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య, కౌన్సిలర్ సమ్మెట సుధీర్, పట్టణ అధ్యక్షుడు చిదురాల కుమారస్వామి, నాయకులు గుంటి కుమారస్వామి, మన్సూద్, సమ్మెట రాంబాబు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన పోలీసు అధికారులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట టౌన్ సీఐగా సుంకరి రవికుమార్ బుధవారం విధుల్లో చేశారు. అదే విధంగా నర్సంపేట రూరల్ సీఐ పుల్యాల కిషన్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఎమ్మెల్యే టౌన్ సీఐ, రూరల్ సీఐలకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్‌లు సీఐలను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వర్ధన్నపేట: వర్ధన్నపేట ఏసీపీగా సురేష్, సీఐ శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ స్వరూప బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే అరూరి రమేష్ స్వగృహంలో ఆయనను కలిసి పూలబొకేలను అందించారు. ఈ సందర్భంగా అధికారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

ఖానాపురం: ఎస్సైగా బొంగు మాధవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసారు.

ఎస్సైలకు కాంగ్రెస్ నాయకుల సన్మానం

ఖానాపురం ఎస్సైగా పని చేసి బదిలీపై వెళ్తున్న తిరుపతి, నూతన ఎస్సై మాధవ్‌లను కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబుల ఆధ్వర్యంలో ఇద్దరికీ శుభాకాంక్షలు తెలిపారు. సాగర్‌రావు, ముస్తఫా, శ్రీనివాస్, ఎంపీటీసీ ఫూల్‌సింగ్, లాల్‌సాహెబ్, రాములు, నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.